# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 345 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం ● 30, జూన్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి





## ఇంటర్ ప్రవేశాలు జూలై 31 వరకు పొడిగింపు

హైదరాబాద్,జూన్29(నమస్తే ఉదయం): రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ బోర్డు గడువు పొడిగించింది. జులై 31వ తేదీ వరకు ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదలైన

మిగతా.. 2లో

# విశ్వవిజేతగా భారత్

### టీ20 ప్రపంచకప్ మనదే - చెలరేగిన కోహ్లీ.. దంచికొట్టిన అక్షర్




బ్రిడ్జ్‌టౌన్: టీ20 ప్రపంచకప్ మనదే. 17 ఏళ్లుగా ఊరిస్తున్న పొట్టికప్పును భారత్ రెండో సారి సగర్వంగా అందుకుంది. దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో భారత్ 7 పరుగుల తేడాతో అద్వితీయమైన విజయం సాధించి విశ్వవిజేతగా అవతరించింది.



తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా.. కోహ్లీ (76: 59 బంతుల్లో 6ఐ4, 2ఐ6), అక్షర్ పటేల్ (47బీ 31 బంతుల్లో 1ఐ4, 4ఐ6) చెలరేగిన వేళ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 169 పరుగులకే పరిమితం అయింది.

ఆ జట్టులో క్లాసెన్ (52: 27 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగాడు. క్వింటన్ డికాక్ (39: 31 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్), స్టబ్స్ (31: 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్య 3, బుమ్రా 2, అర్ష్‌దీప్ సింగ్ 2, అక్షర్ పటేల్ ఒక వికెట్ తీశారు.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ 7 వికెట్ల నష్టపోయి 176 పరుగులు చేసింది. ఇన్నింగ్స్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (9) తక్కువ పరుగులకే ఔటయ్యాడు. కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.

మిగతా.. 2లో



## కొండగట్టును దర్శించుకున్న పవన్ కళ్యాణ్

### ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన డిప్యూటి సిఎం

### దారిపొడవునా అభిమానుల నీరాజనాలు

కొండగట్టు,జూన్29(నమస్తే ఉదయం): ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో స్థానికులు ఆలయానికి తరలివచ్చారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలు దేరిన పవన్‌కు.. మార్గమధ్యలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. తుర్కపల్లి క్రాస్ రోడ్స్ వద్ద జనసేన నాయకులు గజమాలతో ఆయనను సత్కరించారు. పవన్ రాక నేపథ్యంలో.. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి రోడ్డుమార్గంలో శనివారం ఉదయం ఆయన కొండగట్టుకు బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయనకు దారి పొడవునా అభిమానులు ఘనస్వాగతం పలికారు. ముందుగా హైదరాబాద్ శివారులోని తుర్కపల్లిలో పవన్ కల్యాణ్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చారు. తుర్కపల్లి నుంచి బయల్దేరిన తర్వాత సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి వద్ద కూడా జనసేన అధినేతకు ఘన స్వాగతం లభించింది. అక్కడ పవన్ కల్యాణ్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అభిమానులు అందించిన వీరఖడ్గంతో ఆయన ఫొటోలకు పోజులిచ్చారు. అనంతరం అభిమానులకు అభివాదం చేసుకుంటూ కొండగట్టుకు బయల్దేరి వచ్చారు. ఏపీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించడంతో పవన్ కల్యాణ్ వారాహి అమ్మవారి దీక్షను చేపట్టారు. 11 రోజుల పాటు నిష్టతో ఈ దీక్షను పాటించనున్నారు. ఈ క్రమంలోనే తమ ఇలవేల్పు అయిన కొండగట్టు ఆంజనేయ స్వామిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, గత ఏడాది ఎన్నికలకు ముందు ప్రచారం మొదలుపెట్టిన పవన్ కల్యాణ్.. తన వారాహి ప్రచార రథానికి కొండగట్టులోనే ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారాహి విజయయాత్రను నిర్వహించారు.



## హెరిటేజ్ సిటీగా

# వరంగల్ అభివృద్ధి

### వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయండి - ఔటర్ రింగ్ రోడ్డుకు ప్రతిపాదనలు

### వరంగల్ పర్యటనలో అధికారులతో సిఎం రేవంత్ సమీక్ష

వరంగల్,జూన్29(నమస్తే ఉదయం): వరంగల్ అభివృద్ధికి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. వరంగల్ పర్యటనలో ఉన్న ఆయన నగర అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. హెరిటేజ్ సిటీగా తీర్చిదిద్దటానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్డుకు భూసేకరణ పూర్తి చేయాలని, దానికి అవసరమైన నిధుల వివరాలు ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. హైవేలను అనుసంధానిస్తూ వరంగల్ ఔటర్ రింగ్‌రోడ్డు ఉండేలా చూడాలన్నారు. ఓఆర్ఆర్ నుంచి టెక్స్‌టైల్ పార్కును అనుసంధానించాలని చెప్పారు. స్మార్ట్‌సిటీలో భాగంగా భూగర్భ డ్రైనేజీ అభివృద్ధి చేయాలని, నాలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించిన ఆయన.. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హన్మకొండ కలెక్టరేట్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి పనుల పురోగతి, చేపట్టాల్సిన పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సీఎం సమీక్షిస్తున్నారు. నగరాభివృద్ధికి సంబంధించి ఇన్‌చార్జి మంత్రి ప్రతీ 20రోజులకోసారి సమీక్ష నిర్వహించాలని అన్నారు. మామునూరు ఎయిర్ పోర్ట్‌పై సైతం సమీక్షించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖలతో పాటు సీఎస్ శాంతికుమారి,డీజీపీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఇన్నర్, ఔటర్‌రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. నేషనల్ హైవే నుంచి నేషనల్ హైవేకు కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్డు ఉండాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్‌టైల్ పార్క్‌కు కనెక్టివిటీ ఉండేలా రోడ్డుమార్గం ఉండేలా చూడాలన్నారు. స్మార్ట్ సిటీ మిషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. డ్రింకింగ్ వాటర్ లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నాలాలు ఆక్రమణలకు గురవకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగర అభివృద్ధికి సంబంధించి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వరంగల్‌లో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

### నిబంధనలకు విరుద్ధంగా అనుమతులపై సిఎం ఆగ్రహం

### మౌఖిక ఆదేశాలతో ఎలా పెంచుతారని రేవంత్ ప్రశ్న

### గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశం




## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం

# వ్యయం పెంపు

వరంగల్,జూన్29(నమస్తే ఉదయం): వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం విషయంలో ఇష్టారీతిన అంచనా వ్యయం పెంచడంపై అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1100 కోట్లున్న అంచనా వ్యయాన్ని రూ.1726 కోట్లకు ఎలా పెంచారని సీఎం ప్రశ్నించారు. కేవలం మౌఖిక ఆదేశాలతో రూ.626 కోట్ల వ్యయం ఎలా పెంచుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అంచనా వ్యయం పెంచడమేంటని ఫైరయ్యారు. నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని నిర్మాణ సంస్థకు తేల్చి చెప్పారు. హైదరాబాద్‌తో పాటు సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వరంగల్ పర్యటనలో భాగంగా హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు సీఎం సూచించారు. ఆస్పత్రి విసయంలో మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా అంచనా వ్యయం పెంచడమెంటని ఆయన మండిపడ్డారు. నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి

మిగతా.. 2లో

## కాంగ్రెస్ సీనియర్ నేత డిఎస్ కన్నుమూత

### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస

### నిజామాబాద్‌కు భౌతిక కాయం తరలింపు

### నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

హైదరాబాద్,జూన్29(నమస్తే ఉదయం): తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డీఎస్.. శనివారం తెల్లవారు జామున 3 గంటలకు తుదిశ్వాస విడిచారు.దీంతో బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన స్వగృహానికి భౌతికకాయాన్ని తరలించారు. మధ్యాహ్నం 2 గంటల వరకు పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం నిజామాబాద్ పట్టణానికి తరలిస్తారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన సొంత నియోజకవర్గమైన ఇందూరు పట్టణంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఇదే విషయాన్ని కుటుంబ సభ్యులు కూడా వెల్లడించారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న ఆయన కుమారుడు, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మధ్యాహ్నానికి హైదరాబాద్ చేరుకున్నారు. అనంతరం డీఎస్ భౌతిక కాయాన్ని ప్రజలు, అభిమానుల సందర్శనార్థం నిజామాబాద్‌కు తరలించనున్నారు. డీఎస్ మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తంచేశారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీఎస్ భౌతికకాయానికి నివాళులర్పించారు. బిఆర్ఎస్ నేత కెటిఆర్, తదితరులు డిఎస్ ఇంటికి వెళ్లి నివాళి అర్పించారు.




## ఆదిలాబాద్ మాజీ ఎంపి రామేశ్ రాథోడ్ మృతి

### ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృత్యువాత

### సంతాపం తెలిపిన సిఎం రేవంత్, కేంద్రమంత్రులు, బిజెపి నేతలు



ఆదిలాబాద్,జూన్29(నమస్తే ఉదయం): ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్(59) కన్నుమూశారు. శుక్రవారం అర్ధరాత్రి ఉట్నూర్‌లోని తన నివాసంలో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకువస్తుండగా.. మార్గమధ్యంలో ఇచ్చోడ వద్ద తుది శ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని ఉట్నూర్‌కు తరలించారు. రమేష్ రాథోడ్ మృతి పట్ల పలువురు నేతలు సంతాపం ప్రకటించారు. తెదేపా తరఫున 1999లో ఖానాపూర్ ఎమ్మెల్యేగా రమేష్ రాథోడ్ ఎన్నికయ్యారు. 2009లో ఆ పార్టీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా తెదేపా నుంచి భారాసలో చేరారు. అనంతర పరిణామాల్లో కాంగ్రెస్‌లో చేరి 2019లో ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత భాజపాలోకి వెళ్లారు. ఎంపీ టికెట్ కోసం ప్రయత్నించారు. ఆయన వయస్సు 58 సంవత్సరాలు. శనివారం ఉదయం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా.. మార్గమధ్యంలో ఆయన మరణించారు. శుక్రవారం రాత్రి రమేష్ రాథోడ్ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి ఆయన్ని తరలించారు. అయితే శనివారం ఉదయం మెరుగైన వైద్య చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆయన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఆ క్రమంలో ఆయన మృతి చెందారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గానే కాకుండా లోక్‌సభ సభ్యుడిగా రమేష్ రాథోడ్ పని చేశారు. తెలుగుదేశం, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో రమేశ్ రాథోడ్ కీలక నేతగా పని చేశారు. ఆయన స్వస్థలం నార్నూర్ మండలం తాడిహాత్నూర్. రాతోడ్ మృతికి సిఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన మృతి తెలంగాణకు తీరని లోటని అన్నారు. నిబద్ధత కలిగిన రాజకీయ నేత అని అన్నారు. మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకుడు రమేశ్ రాథోడ్ మృతిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రమేశ్ రాథోడ్ బీజేపీలో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. మొన్నటి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ చాలా ఉత్సాహంగా పార్టీకోసం కష్టపడ్డారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కీలకంగా వ్యవహరించారని చెప్పారు.


జలాల్ బాబా నగర్‌లో కార్డెన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు


గంజాయి కోసం తనిఖీలు చేస్తున్న పోలీసులు



కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

# జలాల్ బాబా నగర్, భూపాల్ నగర్ ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్ చేసిన రాజేంద్రనగర్ డివిజన్ పోలీసులు

**రాజేంద్రనగర్, జూన్29(నమస్తే ఉదయం):** బహిరంగ ప్రదేశాలలో గంజాయి, మద్యం సేవిస్తున్నట్లు ఉన్న సమాచారం మేరకు శనివారం రాజేంద్రనగర్ డివిజన్ పోలీసులు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్ బాబా నగర్, భూపాల్ నగర్, 24వ ప్రాంతంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పలువురు యువకులను తనిఖీలు చేశారు. ఎవరైనా గంజాయి తాగుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘ పెట్టామని హెచ్చరించారు. కార్డెన్ సెర్చ్ లో అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్ దేవుపల్లి ఇన్స్ పెక్టర్లు జి.వెంకట్రామిరెడ్డి, బి.నాగేంద్రబాబు, పి.మధు లతోపాటు పలువురు ఎస్సైలు, టీఎస్ ఎస్పీ పోలీసులు, స్పెషల్ పోలీసులు పాల్గొన్నారు.


పోలీసులు తనిఖీలు


ఉద్యోగ విరమణ పొందిన ఎంఎ నయీమ్‌కు సన్మానం చేస్తున్న మిత్రులు,


ఎం ఎ నయీమ్‌ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ప్రతినిధులు

# ఉద్యోగ సంఘం నేత ఎంఎ నయీమ్ ఉద్యోగ విరమణ

**రాజేంద్రనగర్, జూన్29(నమస్తే ఉదయం):** హిమాయత్ సాగర్ లోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (వాలంతరీ)లో వర్క్ ఇన్స్ట్రక్టర్ గ్రేడ్ 2గా ఉద్యోగం చేస్తూ, టీఎన్జీవోస్ రాజేంద్రనగర్ తాలూకా జేఏసీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మహమ్మద్ అబ్దుల్ నయీమ్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. 41 సంవత్సరాల పాటు ఎం ఎ నయీమ్ వాలంతరీ లో ఉద్యోగం చేశారు. ఎంఎ నయీమ్ ఉద్యోగ విరమణ సందర్భంగా వాలంతరీ అధికారులు, ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. నయీమ్ వాలంతరీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నయీమ్ శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థించారు.

**నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం :** ఉద్యోగ విరమణ పొందిన ఎంఎ నయీమ్‌ను నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షుడు వేముల వెంకటేశం , ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.




# విశ్వవిజేతగా భారత్

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం క్రీజులోకి వచ్చిన రిషబ్ పంత్ ఒక్క బంతి వ్యవధిలోనే డకౌట్‌గా వెనుదిరిగాడు. స్వల్ప వ్యవధిలోనే సూర్యకుమార్ యాదవ్ (3) సైతం రబాడా బౌలింగ్‌లో షాట్‌కు ప్రయత్నించి క్లాసెన్‌కు దొరికి పోయాడు. ఐదు ఓవర్లలోనే కీలకమైన 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ భారత్‌ను అక్షర్ పటేల్‌తో కలిసి కోహ్లీ ఆదుకున్నాడు. వీరిద్దరూ కలిసి క్రీజులో నిలదొక్కుకొని వీలుచిక్కినప్పుడల్లా ఫోర్లు, సిక్సర్లు బాదేశారు.

అర్ధశతకానికి చేరువలో సమన్వయ లోపంతో అక్షర్ పటేల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. చివర్లో శివమ్ దూబె (27బీ 16 బంతుల్లో 3ఐ4,1ఐ6)తో కలిసి కోహ్లీ మెరుపులు మెరిపించాడు. జడేజా (2), హార్దిక్ పాండ్య (5లి) పరుగులు చేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహరాజ్, నోకియా తలో 2 వికెట్లు పడగొట్టగా.. మార్కో యాన్సెన్, రబాడ చెరో వికెట్ తీశారు.

## ఇంటర్ ప్రవేశాలు జూలై 31 వరకు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సప్లిమెంటరీ ఫలితాల్లో పాసైన విద్యార్థుల కోసం ఫస్టియర్‌లో ప్రవేశాల గడువును పొడిగించారు. ఇక ఇంటర్‌లో ప్రవేశం తీసుకోవాలనుకునే విద్యార్థులు ఇంటర్నెట్ మార్క్స్ మెమో, ఆధార్ కార్డు తప్పనిసరిగా దరఖాస్తుకు జతపరచాలి. ప్రొవిజినల్ అడ్మిషన్ పూర్తయిన తర్వాత కచ్చితంగా ఒరిజినల్ మెమోతో పాటు టీసీ సమర్పించాల్సి ఉంటుంది. ఇక ఇంటర్మీడియట్ బోర్డు చేత గుర్తింపు పొందిన కాలేజీల జాబితాను ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఆ జాబితా ఆధారంగా అడ్మిషన్లు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ పక్రియ

**జులై 4 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ : టీజీపీఎస్సీ**

**హైదరాబాద్,జూన్29(నమస్తే ఉదయం):** రాష్ట్రంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ పక్రియకు సంబంధించి టీజీపీఎస్సీ కీలక ప్రకటన విడుదల చేసింది. జులై 4 నుంచి 8వ తేదీ వరకు టీజీపీఎస్సీ కార్యా లయంలో ఎంపిక చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తేదీ నుంచి 8 వరకు ప్రతి రోజు ఉదయం 10.30 గంటలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పక్రియ ప్రారంభమవుతుందన్నారు. జులై 3వ తేదీ నుంచి ఆప్షన్స్‌కు అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితా టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. గతేడాది జులై నెలలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి రాత పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని రెండు కేంద్రాల్లో నిర్వహించారు. క్లాస్-ఏలో 170, క్లాస్-బీలో 15 ఉద్యోగాలకు 1,172 మంది దరఖాస్తు చేసుకొన్నారు. క్లాస్-ఏ ఉద్యోగాలకు ఉదయం పేపర్-1 పరీక్షకు 835 మంది హాజరయ్యారు. పేపర్-2ను 810 మంది రాశారు. క్లాస్-బీ ఉద్యోగాల నియామక పరీక్షకు 103 మంది హాజరయ్యారు.

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వ్యయం పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని నిర్మాణ సంస్థకు సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు.అయితే.. ఇదిలా ఉంటే.. వరంగల్ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలన్న సీఎం.. హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూసేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. నేషనల్ హైవే నుంచి నేషనల్ హైవేకు కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్డు ఉండాలని, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్టైల్ పార్కుకు కనెక్టివిటీ ఉండేలా రోడ్డుమార్గం ఉండేలా చూడాలన్నారు. స్మార్ట్ సిటీ మిషన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, డ్రింకింగ్ వాటర్ లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని, వరంగల్ నగర అభివృద్ధిపై ఇకనుంచి ప్రతీ 20 రోజులకోసారి ఇంచార్జ్ మంత్రి సమీక్ష నిర్వహించాలని, నగర అభివృద్ధికి సంబంధించి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ తెలిపారు. వరంగల్‌లో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి.

## భారీ వర్షాలతో ఢిల్లీలో 11 మంది మృతి


**న్యూఢిల్లీ, జూన్ 29,(నమస్తే ఉదయం):** రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఢిల్లీలో 11 మంది మరణించినట్టు అధికారులు ప్రకటించారు. వసంత విహార్‌లో గోడ కూలిన సంఘటనలో ముగ్గురు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. మరోవైపు, వర్షాల కారణంగా గుజరాత్‌లోని రాజ్‌కోట్ విమానాశ్రయం బయట ప్రయాణికుల పిక్‌పడ్రాప్ ప్రాంతంలోని కప్పు కూలిపోయింది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం సంభవించలేదు. కాగా, ఢిల్లీలో విమానాశ్రయం పైకప్పు కూలిపడటంతో జరుగుతున్న మరమ్మతు పనుల కారణంగా చెన్నైలో 16 విమాన సర్వీసులు రద్దయ్యాయి.

## సైనిక విన్యాసాల్లో అపశ్రుతి..

**వరదతో నదిలో మునిగిన టీ-72 ట్యాంక్**

**ఒక అధికారి సహా ఐదుగురు జవాన్ల దుర్మరణం**

**జమ్మూ, జూన్ 29,(నమస్తే ఉదయం):** కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లో భారత సైన్యం నిర్వహించిన యుద్ధట్యాంక్‌ల విన్యాసంలో అపశ్రుతి చోటుచేసుకుంది. టీ-72 యుద్ధ ట్యాంకుతో బోధి నదిని దాటుతుండగా..ఆకస్మిక వరద ఉధృతి పెరిగింది. దీంతో ఆ ట్యాంకులో ఉన్న ఓ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీవో), నలుగురు జవాన్లు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ)కి సమీపంలో.. దౌలత్‌బేగ్ ఓల్డీలోని న్యోమా-చుషుల్ ప్రాంతంలో చోటుచేసుకుంది.



శనివారం తెల్లవారుజామున టీ-72 యుద్ధ ట్యాంకుతో నదిని దాటుతుండగా.. ఈ ఘటన చోటుచేసుకుందని రక్షణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. మృతుల్లో డ్రైవర్, గన్‌మన్ సహా.. నలుగురు సైనికులు, ఓ జేసీవో ఉన్నట్లు వివరించింది.



కలెక్టర్ బిఎస్ సంతోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

# అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం):** అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని గద్వాల వర్కింగ్ జర్నలిస్టు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ... జర్నలిస్టులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ మీడియా రంగంలో పని చేస్తున్నారని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించి వెంటనే ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# అయిజలో బస్సు పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలి : ఏబీవీపీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం):** ఐజ మున్సిపల్ కేంద్రంలో బస్సు పాస్ కౌంటర్ ను ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకులు గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.



డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలో ఏబీవీపీ గద్వాల్ జిల్లా కన్వీనర్ సురేష్ మాట్లాడుతూ... అయిజ నుండి వివిధ గ్రామాల నుండి వచ్చే విద్యార్థులు చదువుకోవడానికి అయిజకు వస్తున్నారు అయితే బస్సు పాస్ తీసుకోవాలంటే పాఠశాల, కళాశాలలకు సెలవు పెట్టి గద్వాల్ కు పాస్ కోసం రావాల్సి ఉండటంతో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని అందుకోసం అయిజ లో ఉన్న బస్టాండ్ లోనే బస్సు పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలనీ కోరడమైనది అంతేకాకుండా విద్యార్థులకు సరైన సమయం లో బస్సులు నడిపే విధంగా చూడాలని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని గద్వాల్ డిపో మేనేజర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమం లో ఏబీవీపీ నాయకులు వెంకటేష్, నరేష్, పవన్ పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం):** జిల్లాలో పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.



ధరణిపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

జూన్ 15 నుంచి జూన్ 28 వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ఆర్ఐ పట్టా పాస్ పుస్తకం, కోర్టు కేసు, కోర్టు వివాదంలో ఉన్న పట్టా పాస్ పుస్తకం, డేటా కరెక్షన్, జిపిఏ, ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ, నూతన పట్టా పాస్ పుస్తకాల జారీ/ నాలా, ఖాతా మెర్జింగ్, భూ సంబంధిత ఫిర్యాదులు, నాలా పిపిబి, పెండింగ్ మ్యూటేషన్, సక్సెషన్, అర్బన్ ల్యాండ్ మొదలగు అంశాలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ మాట్లాడుతూ, జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం వారం రోజుల్లో పూర్తి చేసి ఆన్ లైన్ లో పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు, ఆర్డీవో రామచందర్, అన్ని మండలాల తహసీల్దారులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి లడ్డు నాణ్యత మరింత పెంచండి

## టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆదేశాలు

**తిరుపతి,జూన్29(నమస్తే ఉదయం):** శ్రీవారి లడ్డు ప్రసాదాలు మరింత రుచిగా, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో జె. శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఈవో కార్యాలయంలో టీటీడీ అధికారులు, డైరీ నిపుణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, మరింత నాణ్యమైన నెయ్యిని ఎలా కొనుగోలు చేయాలి, కొనుగోలు చేసిన నెయ్యిని ప్రస్తుతం పరీక్షిస్తున్న విధంగా కాకుండా మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా పరీక్షించాలి తదితర అంశాలపై, అందుకు తీసుకోవలసిన మార్పులను తెలియజేయాలని ఆయన నిపుణులను కోరారు. తరువాత ప్రముఖ డెయిరీ నిపుణులు విజయభాస్కర్ రెడ్డి, సురేంద్రనాథ్ లడ్డు నాణ్యత పెంచేందుకు ఎస్ఎస్ఐ నిబంధనల ప్రకారం నాణ్యమైన నెయ్యిని ఎలా తయారు చేస్తున్నారు, ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా అగ్ మార్క్, టీటీడీ నిబంధనల ప్రకారం నెయ్యి నాణ్యత ఎలా ఉండాలనే విషయమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారు వివరించారు. ఈ సమావేశంలో జెఈఓ గౌతమి, ఎస్వి గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, కొనుగోలు జిఎం మురళీకృష్ణ, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


డీన్ అగ్రికల్చర్ డాక్టర్ సీమకు మెమోంటో అందచేస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ పి. రఘురామిరెడ్డి


డైరెక్టర్ ఆఫ్ ఎక్స్ టెన్షన్ డాక్టర్ వి సుధారాణి కి మెమోంటో అందచేస్తున్న డాక్టర్ పి. రఘురామిరెడ్డి


ఆఫీస్ సబార్డినేట్ అశోక్ కు మెమోంటో అందచేస్తున్న డాక్టర్ పి. రఘురామిరెడ్డి

# వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల ఉద్యోగ విరమణ

**రాజేంద్రనగర్, జూన్29(నమస్తే ఉదయం):** రైతాంగానికి నిరంతరం సేవలందించే అవకాశం కల్పించిన విశ్వవిద్యాలయ పురోగతికి సిబ్బంది అనుక్షణం అంకితభావం, నిజాయితీతో పనిచేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామి రెడ్డి అన్నారు. గత కొన్నేళ్ళుగా అనేక వేల మంది నిరంతర శ్రమతోనే నేడు విశ్వ విద్యాలయం ఉన్నత శిఖరాలు చేరుకోగలుగుతుందన్నారు. వారి స్ఫూర్తితో ప్రస్తుత సిబ్బంది పనితీరు సాగాలని రఘురామి రెడ్డి సూచించారు.

ఈనెలాఖరుకి ఉద్యోగ విరమణ చేయనున్న విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ, విస్తరణ సంచాలకులు డాక్టర్ వి. సుధారాణి, ఆఫీస్ సబార్డినేట్ బి. అశోక్‌ల ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశం ఈరోజు రాజేంద్రనగర్‌లోని వాటర్ టెక్నాలజీ సెంటర్ ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా వారు దశాబ్దాల పాటు విశ్వవిద్యాలయానికి అందించిన సేవల్ని రిజిస్ట్రార్ అభినందించారు. అధికారికంగా సత్కరించారు. అదే విధంగా అనేకమంది అధికారులు, సిబ్బంది కూడా ఉద్యోగ విరమణ చేస్తున్న వారిని అభినందించి సత్కరించారు. వారితో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ఇంతకాలం తమ విధుల నిర్వహణకి సహకరించిన విశ్వవిద్యాలయం సిబ్బందికి డాక్టర్ సీమ, డాక్టర్ సుధారాణి, అశోక్ లు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


# శంషాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

## ఊట్‌పల్లిలో 75 లక్షల రూపాయల విలువైన మాదకద్రవ్యం స్వాధీనం - నిందితుడు అంబాలాల్ అరెస్ట్

**శంషాబాద్, జూన్ 29( నమస్తే ఉదయం):** శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఊట్‌పల్లిలో శుక్రవారం రాత్రి దాడి చేసిన పోలీసులు దాదాపు 75 లక్షల రూపాయల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

ఓ పక్క పోలీసులు డ్రగ్స్ పట్ల అవగాహన కల్పిస్తున్నప్పటికీ మరోపక్క డ్రగ్స్ విక్రయిస్తూ నేరగాళ్లు పట్టుబడుతూనే ఉన్నారు. తాజాగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 618 గ్రాముల హెరాయిన్ డ్రగ్స్ పట్టుబడింది.

దానికి సంబంధించిన వివరాలను శంషాబాద్ సిఐ నరేందర్ రెడ్డి శనివారం వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అంబాలాల్ సుతార్ (54) అనే వ్యాపారస్తుడు మూడు సంవత్సరాల క్రితం శంషాబాద్ వచ్చాడు. ఊట్పల్లిలోని అమరేందర్ గౌడ్ ఇంట్లో అద్దెకు ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. అయితే



అతడు హెరాయిన్ డ్రగ్స్ వాడుతున్నాడనే పక్కా సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం రాత్రి అతడు ఉంటున్న గదిలో తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 618 లభించిన మత్తు పదార్థం లభించింది. దీంతో ఆ మత్తు పదార్థాన్ని టెస్టింగ్ చేసేందుకు ల్యాబ్‌కు పంపించారు.

ల్యాబ్‌కు పంపించిన మత్తు పదార్థం హెరాయిన్‌గా తేలింది. దీంతో నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారణ మొదలు పెట్టారు. అయితే నిందితుడు హెరాయిన్ డ్రగ్స్ బెల్లం పాకంలో మరిగించి చిన్నచిన్న ఉండ్రలు చుట్టి దానిని ఓ డబ్బాలో వేసుకుంటాడు. ఉండలుగా చుట్టిన వాటిని రోజుకు ఒకటి చొప్పున వాడుతూ ఉంటాడని పోలీసుల విచారణలో తేలింది. పట్టుబడ్డ హెరాయిన్ డ్రగ్స్ విలువ 75 లక్షలు ఉంటుందని సిఐ నరేందర్ రెడ్డి తెలిపారు. నిందితుడుపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# జూలై 1 నుండి కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29 (నమస్తే ఉదయం):** జూలై 1 నుండి అమల్లోకి వచ్చే కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసే క్రమంలో స్టేషన్ ల ఎస్ హెచ్ ఓ లు,స్టేషన్ రిటర్లు, సి సి టి ఎన్ ఎస్ రైటర్స్ కొత్త చట్టాల ఎస్ఓపీనీ అనుసరించి కేసులు నమోదు చేయ్యడం, ఇన్వెస్టిగేషన్ చేయడం, సాక్ష్యాలను సేకరించి కోర్టులలో చార్జీ షీట్ వేయాలని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు పోలీస్ అధికారులను ,స్టేషన్ రైటర్స్‌ను ఆదేశించారు. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్‌ల ఉన్న ఎస్సైలకు, ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పని చేస్తున్న రైటర్స్‌కు, సి సి టి ఎన్ ఎస్ రైటర్స్‌కు డిఎస్పీ సత్యనారాయణ ఆద్వర్యంలో నూతన చట్టాల అమల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సేకరించాల్సి సాక్ష్యాలు తదితర అంశాల గురించి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.



ఈ కార్యక్రమాన్నికి జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై ఎస్సైలకు,స్టేషన్ రైటర్స్ కు, సి సి టి ఎన్ ఎస్ రైటర్స్ కు జూలై 1 వ తేది కొత్త చట్టాలను అనుసరించి కేసులు నమోదు చెయడం, సాక్ష్యాలను సేకరించడం, కోర్టులలో చార్జ్ షీట్ వేసే క్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తల పై పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జులై 1 నుండి కొత్త చట్టాలను అనుసరించి కేసులు నమోదు చెయ్యాలని, కొత్త చట్టాల ఎస్ ఓ పి నీ అనుసరించి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, ఇతర సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించి కోర్టులలో చార్జీ షీట్ వేయడం ద్వారా నేరస్థులకు శిక్షలు పడే శాతాన్ని పెంచాలని అధికారులకు, రైటర్స్ కు సూచించారు.

కొత్త చట్టాలను అనుసరించి ఆయా సెక్షన్ ల ద్వారా కేసులు నమోదు చేసే క్రమం లో, సాక్ష్యాధారాలను సేకరించే క్రమంలో ఏలాంటి సందేశాలను ఉన్నతాధికారులను ఫోన్‌లో సంప్రదించి వారి సలహాలు,సూచనలు తీసుకోవాలని ఆదేశించారు.

పకడ్బందీగా సాక్ష్యాధారాలను సేకరించి, విచారణ చేపట్టి కోర్టు లోచార్జీ షీట్ సబ్మిట్ చెయడం ద్వారనే నేరస్థులకు శిక్షలు పడే శాతాన్ని పెంచవచ్చు అని ఆ దిశగా కృషి చేయలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధిలో సుమ్మన్స్ ను ప్రాపర్ గా సర్వ్ చెయ్యాలని, ఎన్ బి డబ్ల్యు ఎస్ వారెంట్స్ సర్వ్ చెయ్యాలని, ఎప్పటికప్పుడు ఆయా కేసులకు సంబంధించిన CC (కోర్టు కేలండర్) నంబర్స్ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల్, శాంతి నగర్ సీఐ లు భీమ్ కుమార్, రత్నం, ఎస్బి ఇన్స్పెక్టర్ జంములప్ప, అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్సై, వివిధ విభాగాల ఎస్సై లు అన్ని పోలీస్ స్టేషన్ ల రైటర్స్ , సిసిటిఎన్ఎస్ రైటర్స్ పాల్గొన్నారు.

# ప్రమాదానికి గురైన మున్సిపల్ కార్మికుని పరామర్శించిన రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, జూన్ 29(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాప్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి వనం పల్లి జైపాల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.రాములు, కోశాధికారి హరి నాథ్ రావు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులులతో కలిసి ప్రమాదానికి గురైన కార్మికుడిని పరామర్శించారు.

గాజులరామారం సర్కిల్ చింతల్ మెయిన్ రోడ్డు లో పారిశుద్ధ్య కార్మికుడు శాంతారావు విధులు నిర్వహిస్తుండగా నిద్ర మత్తులో వచ్చిన కారు డ్రైవర్ యాక్సిడెంట్ చేయడం జరిగింది. తీవ్ర గాయాలతో ఈఎస్ఐ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కార్మికుని పరమర్శించడం జరిగింది. ప్రమాదానికి గురైన కార్మికునికి కారు డ్రైవర్ పై జీడిమెట్ల పోలీస్ స్టేషన్ లో కేసు పెటించడం జరిగింది. నైట్ వరకు అక్కడే ఉండి కారు డ్రైవర్ తో చర్చించి కార్మికుని కుటుంబానికి 80 వేల రూపాయలు ఆర్థిక సాయం చేయించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు స్వామి తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదానికి గురైన కార్మికుడిని పరామర్శించిన ఏఐటీయూసీ నాయకులు జైపాల్ రెడ్డి

# శంషాబాద్ ఎయిర్ పోర్టులో విదేశీ కరెన్సీ స్వాధీనం...



### 67 లక్షల రూపాయల విలువైన అమెరికన్ కరెన్సీ లభ్యం

**శంషాబాద్, జూన్ 29(నమస్తే ఉదయం):** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి దుబాయ్ వెళుతున్న ఓ ప్రయాణికుడి వద్ద డి ఆర్ ఏ. అధికారులు పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుండి దుబాయ్ వెళ్తున్నావు ప్రయాణికుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అధికారులు అతన్ని లగేజీని చెక్ చేశారు. ప్రయాణికుడి ట్రావెలింగ్ బ్యాగులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలో డాలర్లను గోప్యంగా దాచి ఉంచారు. నిందితుడి లగేజీని తనిఖీ చేసిన డిఆర్ఏ అధికారులు పెద్ద ఎత్తున విదేశీకరణీ లభించడంతో ఆశ్చర్యపోయారు. అధికారులు స్వాధీనం చేసుకున్న అమెరికన్ కరెన్సీ విలువ 67 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. నగదును స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శంషాబాద్‌లో డి.ఎస్.ఆర్ స్పా ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

**శంషాబాద్, జూన్ 29(నమస్తే ఉదయం):** ప్రజల ఆరోగ్య రక్షణలో భాగంగా శంషాబాద్‌లో ఏర్పాటుచేసిన డి ఎస్ ఆర్. స్పా కేంద్రాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శనివారం ప్రారంభించారు. కేరళ రాష్ట్రానికి చెందిన అశ్రవ్ ఏర్పాటుచేసిన స్పా కేంద్రాన్ని స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ కొలను సుష్మ మహేందర్ రెడ్డి. వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ లతో కలిసి ఆయన ప్రారంభించారు. స్పా సెంటర్ల వలన యువతకు ఎంతో మేలు జరుగుతుందని పని ఒత్తిడిలో ఉండే యువకులు స్పాకు వెళ్లడం వలన తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోగలుగుతారని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర



నాయకుడు గణేష్ గుప్తా.టిఆర్ఎస్ పార్టీ నాయకులు మురళి యాదవ్. కొనమోల శ్రీనివాస్. చేవెళ్ల ప్రసాద్. వై. కుమార్. . పుష్పలత బుచ్చిరెడ్డి. సింగిల్ విండో మాజీ చైర్మన్ సరికొండ కరుణాకర్ గౌడ్. కాంగ్రెస్ పార్టీ నాయకులు. దమ్మాయిగూడ సంతోష్ రెడ్డి. సంజయ్ యాదవ్ గడ్డం శేఖర్ యాదవ్. స్రవంతి శ్రీకాంత్ రెడ్డి. తాజ్ బాబా. బొబ్బిలి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు సామాన్యులకు మెరుగైన వైద్యం అందించాలి

### - నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచికుల్ల రాకేశ్ రెడ్డి

**కొత్తకోట, జూన్29(నమస్తే ఉదయం):** కార్పొరేట్ వైద్యశాలలో సామాన్యుడికి వైద్యం అందని ద్రాక్షగా తయారైందని అందుకోసం వైద్యులు సామాన్లకు మెరుగైన వైద్యం సామాజిక దృక్పథంతో అందించాలని నాగర్ కర్నూల్ ఎంఎల్ఏ, తెలంగాణ డెంటల్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ కూచికుల్ల రాకేశ్ రెడ్డి అన్నారు. శనివారం పానినీయ డెంటల్ కళాశాల కన్వేకేషన్ లో కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎం భీమ్ రెడ్డి మనమరాలు, సీనియర్ జర్నలిస్ట్ మూలమల్ల జయసింహారెడ్డి కూతురు మూలమల్ల అక్షర రెడ్డి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ రెడ్డి మాట్లా డుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుం దన్నారు.



ఎమ్మెల్యే రెడ్డితో అక్షరారెడ్డి

# చేవెళ్ల ఎమ్మెల్యే కాలేయాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మండిపడ్డ నాయకులు

## బీఆర్ఎస్ పార్టీని అభివృద్ధి చేసుకుందాం : రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి



**మొయినాబాద్ ,జూన్ 29, (నమస్తే ఉదయం):** చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మొయినాబాద్ మండల నాయకులు మండిపడ్డారు.

దొంగ చాటున పార్టీ మారినందుకు నాయకుల ఆరోపణలు బీఐఆర్ఎస్ పార్టీలో చేవెళ్ల ఎమ్మెల్యేగా గెలుపొందిన కాలే యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరడం పార్టీ నాయకులకు కార్య కర్తలకు తెలియకుండా సరైన పద్ధతి కాదని రాష్ట్ర టిఆర్ఎస్ నాయకులు కొంపల్లి అనంత్ రెడ్డి మండల నాయకులు శ్రీహరి యాదవ్, వెంకట్ రెడ్డిలు పేర్కొన్నారు శనివారము మండల పరిధిలోని అంజనా దేవి గార్డెన్‌లో మండలంలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా... వారు మాట్లాడుతూ ఎవరికి చెప్పకుండా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఎవరు గెలిపిస్తే గెలిచారనీ ఒకసారిఆలోచించుకోవాలని పేర్కొన్నారు .

కార్యకర్తలు నాయకులు లేకపోతే మీ గెలుపు ఎక్కడిదని వారన్నారు టిఆర్ఎస్ పార్టీ తరపున కెసిఆర్ నమ్మి రెండుసార్లు టికెట్ ఇచ్చి చేవెళ్ల నుంచి గెలిపించిన ఆ కృతజ్ఞతలు మర్చిపోయారని అన్నారు ఏది ఏమైనా వచ్చే ఎన్నికల్లో నైనా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్లో ముందు వైయస్సార్ పార్టీ ఉంటే ప్రస్తుతం టిడిపి పార్టీ గెలిపిందని ఆయన తెలిపారు త్వరలో చేవెళ్ల నియోజకవర్గం కార్యచరణ పై మాజీ మంత్రి సబితా రెడ్డి తో సమీక్షించి మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఆ పార్టీ అధ్యక్షులను కార్యవర్గ సభ్యులను ఎన్నుకునేందుకు సన్నాలు నిర్వహిస్తున్నామని తెలిపారు అదేవిధంగా సమావేశం నుంచే నేరుగా మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డికి ఫోన్లో మాట్లాడి చేవెళ్ల నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి సన్నాలు కృషి చేసేందుకు మాట్లాడారు పార్టీలు మారడం వ్యక్తిగత విషయాలు ఉన్నప్పటికీ నాయకులు కార్య కర్తలు గెలిపించిన వారిని పార్టీలు మారితే నమ్మబోరని అన్నారు అప్పట్లో కెసిఆర్ నమ్మి రెండుసార్లు టికెట్ ఇచ్చి గెలిపించుకున్నారని గుర్తు చేశారు.

అది మర్చిపోవడం అవివేకమేనని అన్నారు ఈ సమావేశంలో టిఆర్ఎస్ మండల నాయకులు మొర శ్రీనివాస్ , ,వెంకట్ రెడ్డి, సుధాకర్ యాదవ్ , తిరుపతిరెడ్డి నరసింహ గౌడ్ వెంకట్ రెడ్డి, దప్పు రాజు,పరమేష్, ప్రవీణ్, సురేందర్ గౌడ్ ప్రవీణ్ గౌడ్, నాగరాజు , రామ్ చందర్ ముదిరాజ్ , లక్ష్మయ్య యాదవ్, సత్తిరెడ్డి, గణేష్ రెడ్డి, చింతకింది ప్రవీణ్ రెడ్డి, కృష్ణమాచారి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.







ఎ .ప్రభాకర్ రెడ్డి దంపతులను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ ఎం. శ్రీనాథ్, ఏపీ రెడ్డిని సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, తోటి ఉద్యోగులు

# రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపోలో ఆరుగురు ఉద్యోగుల పదవీ విరమణ

**రాజేంద్రనగర్, జూన్29(నమస్తే ఉదయం):** ఆర్టీసీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు, రాజేంద్రనగర్ ఆర్టీసీబస్ డిపోలో టీఐ–3 గా పనిచేస్తున్న ఎద్దుల ప్రభాకర్ రెడ్డి తో పాటు మరో ఐదుగురు ఉద్యోగులు శనివారం ఉద్యోగ విరమణ చేశారు.

**ఎ.పి.రెడ్డి:**

మూడున్నర దశాబ్దాల పాటు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో కార్మిక నాయకునిగా, కార్మికుల పక్షాన నిలిచి తెలం గాణ మజ్దూర్ యూనియన్‌లో అనేక హెూదాలో రీజినల్, జోనల్ , రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసి రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపో లో టీఐ–3గా పనిచేస్తున్న ఎద్దుల ప్రభాకర్ రెడ్డి శనివారం పదవి విరమణ చేసారు. ఎద్దుల ప్రభాకర్ రెడ్డి రాజేంద్రనగర్ డిపో కార్మికులు ఘనంగా వీడ్కోలు పలు కుతు అభినందన సభ ఏర్పాటు చేసారు. ఏపీ రెడ్డి దంప తులను ఘనంగా పూలమాలలతో సన్మానించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మిక నాయకులు మాట్లాడుతూ డిపో కార్మికుల హక్కుల కోసం ఏపీ రెడ్డి చేసిన పోరాటాన్ని కొనియాడారు

ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనాథ్, అసిస్టెంట్ మేనేజర్ సుశీల, డిపో కార్మిక నాయకులు అంజయ్య, సి. ఆనంతయ్య, రామకృష్ణ, ఎస్ ఆర్ రెడ్డితోపాటు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన ఏపీ రెడ్డిని కారులో ఊరేగింపుతో వీడ్కోలు పలుకుతున్న ఉద్యోగులు

**మరో ఐదుగురు ఉద్యోగులు :**

డిపోలో కంట్రోలర్‌గా పనిచేస్తున్న బి.గోవర్ధన్ రెడ్డి, డ్రైవర్‌గా పనిచేస్తున్న బి.వెంకట్ రెడ్డి, కండక్టర్ లుగా పనిచేస్తున్న కె ఎం ఎస్ కుమారీ, శివానంద్, యాదయ్య దంపతులను సైతం డిపో మేనేజర్ ఎం.శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

# ఏడీఈ మధుసూదన్ రావు పదవి విరమణ సందర్భంగా ఘనంగా సన్మానం

**మెహదీపట్నం, జూన్29(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (లైన్స్) గా పనిచేసే పదవీ విరమణ చేసిన బి మధుసూదన్ రావు ను శనివారం అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. శనివారం నానల్ నగర్ చౌరస్తాలో గల విద్యుత్ కార్యాలయంలో మధుసూదన్ రావు పదవి విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎస్ ఈ లు ఎల్ గోపయ్య, పి వెంకన్నలు మాట్లాడుతూ... మధుసూదన్ రావు ఉద్యోగ సర్వీస్‌లో అంకితభావంతో పని చేశారని కొని యాడారు. రాజేంద్రనగర్ సర్కిల్, సైబర్ సిటీ సర్కిల్ వీర స్వామి, రవికుమార్, డివిజనల్ ఇంజనీర్లు పి రాజారాంరెడ్డి, యాదయ్య, దామోదర్ రావు, రామచంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్లు హరీష్ చంద్రశేఖర్, రవీందర్, మురళి గౌడ్ లతోపాటు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.



పదవీ విరమణ చేసిన ఏడిఈ మధుసూదన్ రావుల సన్మానిస్తున్న ఎస్ఈలు ఎల్.గోపయ్య, పి.వెంకన్నలు


**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.